

జనసంద్రంగా మారిన గుండిశెట్టిపల్లె హంద్రీ-నీవా కాలువ గట్టు

కుప్పం చేరిన కృష్ణమ్మ

- జలహారతి ఇచ్చిన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్
- సంబరాలు చేసుకున్న టీడీపీ నేతలు, రైతులు
- జనసంద్రమైన గుండిశెట్టిపల్లె హంద్రీ- నీవా కాలువ గట్టు



గుండిశెట్టిపల్లె వద్ద హంద్రీ-నీవా కాలువలో సారె వదిలి పూజలు చేస్తున్న కంచర్ల శ్రీకాంత్, పీఎస్ మునిరత్నం, తదితరులు

శాంతిపురం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గ ప్రజల చిరకాల కోరిక ఎట్టకేలకు తీరింది. కృష్ణమ్మ జలాలు బిరబిరా పరుగులు పెడుతూ వచ్చేశాయి. శనివారం రాత్రి రామకుప్పం మండలం కొంగాటం గ్రామానికి చేరుకున్న జలాలు.. ఆదివారం ఉదయానికి శాంతిపురం మండలం మఠం పంచాయతీలోకి ప్రవహించాయి. ఈ సందర్భంగా గుండిశెట్టిపల్లె వద్ద ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, పీఎంకే ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్‌బాబు జలహారతి ఇచ్చారు. రైతులు, టీడీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి, సంబరాలు చేసుకున్నారు. కొందరు జంతు బలులిచ్చారు. ఏర్పాట్లను సొన్నేగానిపల్లె పంచాయతీ సర్పంచ్ పుష్పవతి, టీడీపీ మండల అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు, మాజీ వైస్ ఎంపీపీ నందిగం ఉదయకుమార్ నాయుడు ఆధ్వర్యంలో చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో కంచర్ల, మునిరత్నం, సురేష్‌బాబు ప్రసంగించారు. కుప్పం నియోజకవర్గ ప్రజలు తాగు, సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు పడకూడదని హంద్రీ-నీవా కాలువ ద్వారా కృష్ణమ్మ జలాలను తీసుకొచ్చిన అపర భగీరథుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అని ప్రశంసించారు. గత ప్రభుత్వంలో జగన్.. సినిమా సెట్ వేసి కృష్ణా జలాలను కుప్పానికి ఇస్తున్నామని జగన్నాటకం ఆడారని గుర్తుచేశారు. ఇక ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే కుప్పానికి కృష్ణమ్మను తీసుకొచ్చిన ఘనత చంద్రబాబుదన్నారు. రానున్న రోజుల్లో స్వర్ణ కుప్పం చేయడం ఖాయమని స్పష్టం చేశారు. సోమవారానికంతా పరమసముద్రం చెరువుకు కృష్ణా జలాలు చేరుతాయన్నారు. ఈనెల 30వ తేదీనాటికి చెరువు నిండి మొరవపారి, కింద చెరువు కూడా నిండుతుందని తెలిపారు. అలా నియోజకవర్గంలోని 240 చెరువులు నిండటం ఖాయమన్నారు. 30వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు.. పరమసముద్రం చెరువు సమీపంలో జలహారతి ఇస్తారన్నారు. అక్కడే బహిరంగ సభ ఉంటుందని, ప్రతి ఒక్కరూ హాజరై.. కుప్పానికి నీళ్లిచ్చిన సీఎంకు కృతజ్ఞతలు తెలపాలని కోరారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పీవీ నాగరాజు, క్లస్టర్ ఇన్‌చార్జి రాజేంద్ర, రెస్కో చైర్మన్ ప్రతాప్, డైరెక్టర్లు అనుసూయ, బసవరాజు, శరవణకుమార్, టీడీపీ నేతలు చంద్రశేఖర్, మణి, వెంకటేష్, పెద్దన్న, ఆర్.నాగరాజు, బాలు, సింగిరి శ్రీనివాసులు, క్యాబేజీ మురళి, ఉయ్యాల జయరామిరెడ్డి, మునెప్ప, ఏఎంసీ డైరెక్టర్లు, కడా అడ్వైజరీ కమిటీ సభ్యులు, మహిళ నేతలు రూప, హేమావతి, వేద, పొలారాణి, కుప్పం రూరల్ సీఐ మల్లేశ్‌యాదవ్, రాళ్లబూదుగూరు ఎస్‌ఐ నరేష్ తదితరులు పాల్గొన్నారు.



గత నెల 5న మృతి చెందిన తల్లి ఏనుగు

అమ్మా... నువ్వు లేక!

- 'తల్లి'డిల్లుతూ మృతిచెందిన గున్న ఏనుగు
- పది రోజుల తర్వాత కళేబరం గుర్తింపు

గున్న ఏనుగు కళేబరాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్‌వో వివేక్ తదితరులు

కల్లూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఆ గున్న ఏనుగుకు 40 రోజులుగా అమ్మ ఆలనా పాలన దూరమైంది. మందలో తిరుగుతున్నా ఒంటరే అయింది. అమ్మ పాలు లేక.. ఆహారం సరిగా అందక మరణించింది. గున్న ఏనుగు కళేబరాన్ని పది రోజుల తర్వాత గుర్తించిన అటవీశాఖ అధికారులు ఈ అభిప్రాయానికి వచ్చారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. పులిచెర్ల మండలంలోని పాతపేట పంచాయతీ చిట్టారెడ్డిపేట సమీపంలో జూలై ఐదో తేదీ రాత్రి పంటలను ధ్వంసం చేస్తున్న ఓ తల్లి ఏనుగు ప్రమాదవశాత్తూ మృతి చెందింది. ఈ ఏనుగు అప్పటికే ఓ గున్న ఏనుగుకు జన్మనిచ్చింది. దానికి నెల వయసు ఉంటుంది. తల్లి చనిపోయాక మిగిలిన ఏనుగులతో కలిసి అడవిలోకి వెళ్లిపోయింది. అప్పటినుంచి దానికి తల్లి పాలు లేకపోవడం, ఆహారం సరిగా అందలేదు. తల్లి ఏనుగుపై బెంగ పెట్టుకుంది. ఈ నేపథ్యంలో పది రోజుల కిందట పులిచెర్ల మండలం పాళెం పంచాయతీ సరిహద్దులోని సైదుల్లా గుట్ట అటవీ ప్రాంతంలో మృతి చెందింది. అటవీ ప్రాంతం కావడంతో ఎవరూ గుర్తించలేదు. అడవిలో గొర్రెలు మేపుతున్న కాపరులు శనివారం సాయంత్రం గున్న ఏనుగు కళేబరాన్ని గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆదివారం ఉదయం తిరుపతి డీఎఫ్‌వో వివేక్, ఎఫ్ఆర్‌వో మాధవి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని, కళేబరాన్ని పరిశీలించారు. తిరుపతి జూపార్కు వైద్యులు తోహిబాసింగ్ ఆధ్వర్యంలో గున్న ఏనుగు కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించి, అక్కడే దహనం చేశారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో వివేక్ మాట్లాడుతూ.. తల్లి పాలు లేకపోవడం, ఆహారం సరిగా అందకపోవడంతోనే మృతి చెందినట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. పూర్తి వివరాలు పోస్టుమార్టం నివేదికలో వెల్లడవుతాయని చెప్పారు. ఎఫ్ఎస్‌వో భారతి, ఎఫ్‌బీవో జమున, ట్రాకర్స్ పాల్గొన్నారు.

స్మార్ట్‌గా.. రేషన్ కార్డులు

- 30వ తేదీనుంచి పంపిణీకి ఏర్పాట్లు



స్మార్ట్ రేషన్ కార్డు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా 5,34,721 మంది రేషన్ లబ్ధిదారులకు పాత కార్డుల స్థానంలో క్యూఆర్ కోడ్ ఆధారిత కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు విడతల్లో పౌరసరఫరాల శాఖ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేపడుతుండగా, రెండో విడతలో ఈనెల 30వ తేదీనుంచి చిత్తూరు జిల్లాసహా నాలుగు జిల్లాల్లో పంపిణీ ప్రారంభం కానుంది. ఏటీఎం కార్డు తరహాలో వీటిని ముద్రించారు. అమరావతి నుంచి నేరుగా ఇవి తహసీల్దార్ కార్యాలయాలకు రానున్నాయి. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దే వీటిని అందించనున్నారు. ఈ కార్డులపై ముద్రించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేస్తే సులభంగా కుటుంబీకుల వివరాలు, రేషన్ సమాచారం తెలుస్తుంది. ఈ కార్డుల కోసం ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు.



మీడియాతో మాట్లాడుతున్న సురేంద్ర కుమార్

పెయిడ్ ఆర్టిస్టులతో.. వైసీపీ ఫేక్ ప్రచారం

- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్

చిత్తూరు సిటీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పెయిడ్ ఆర్టిస్టులతో.. వైసీపీ ఫేక్ ప్రచారం చేస్తోందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ విమర్శించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక వైసీపీ దుష్ప్రచారం చేస్తోందని ఆరోపించారు. ఇటీవల వర్షాలకు అమరావతి మునిగిపోయిందని తప్పుడు ప్రచారాలు చేశారని చెప్పారు. ఇప్పుడు లక్షల్లో పింఛన్లు రద్దు చేశారంటూ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇలాగే వ్యవహరిస్తే వైసీపీ కనుమరుగు కావడం ఖాయమని జోస్యం చెప్పారు. టీడీపీ నేతలు మోహన్‌రాజ్, యువరాజులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి బ్రహ్మోత్సవాలకు

జోరుగా ఏర్పాట్లు



అగరంపల్లె వద్ద ఏర్పాటు చేసిన ఆర్చి



అన్నదాన కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్



ఆలయం వెనుక వైపు ద్వారానికి పాలిష్ పడుతున్న కూలీలు

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. ఈ నెల 27 నుంచి సెప్టెంబరు 16వ తేదీవరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ఈవో పెంచలకిషోర్ ఆధ్వర్యంలో ఈఈ వెంకటనారాయణ పర్యవేక్షిస్తున్నారు. భక్తులకు స్వామి దర్శనానికి ఇబ్బందులు లేకుండా అన్నదాన కేంద్రం వద్ద నుంచి ఆలయం వరకు ప్రత్యేక క్యూలైన్లు నిర్మించారు. ఆర్చిల ఏర్పాటు, విద్యుద్దీపాలంకరణ పనులు పూర్తికావస్తున్నాయి.

పెద్దిరెడ్డి పాపాలే వెంటాడుతున్నాయ్



పుంగనూరు నియోజకవర్గంలో వందలాది టీడీపీ కార్యకర్తల కుటుంబాల కన్నీటికి కారణం పెద్దిరెడ్డి కుటుంబం. గతంలో చంద్రబాబుపై దాడి చేశారు. అక్రమ కేసులతో నాతో సహా ఎన్నో కుటుంబాలు 60 రోజులు అజ్ఞాతవాసంలో ఉన్నాయి. వందలాది కుటుంబాలను బెంగళూరు, పుదుచ్చేరి, తమిళనాడుకు తరిమేసినప్పుడు.. ఆయా కుటుంబాల్లోని కార్యకర్తల్లో నెలకొన్న బాధలు గుర్తుకు రాలేదా? ఇప్పుడు మిథున్‌రెడ్డి జైల్లో ఉంటే బాధపడడం ఏంటి? గత ఐదేళ్లలో పెద్దిరెడ్డి చేసిన పాపాలు అన్నీ ఇన్నీ కావు. అవే ఆయన్ను వెంటాడుతున్నాయి. ఇప్పటికైనా మారతాడనుకుంటే.. మారలేదు. క్రీడల్లో అవినీతికి పాల్పడిన వారెవరైనా, రోజా అయినా సరే జైలు ఊచలు లెక్కపెట్టాల్సిందే.

- తిరుపతిలో రాష్ట్రస్థాయి క్రీడాపోటీలను ప్రారంభించాక మీడియాతో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రోజూ వ్యాయామం చేయండి

- సన్ డే ఆన్ సైకిల్ కార్యక్రమంలో ఎస్పీ మణికంఠ



సైకిల్ తొక్కుతున్న ఎస్పీ మణికంఠ, ఎంటీవో చంద్రశేఖర్, ఆర్ఐ సుధాకర్ తదితరులు

చిత్తూరు అర్బన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రోజూ వ్యాయామం చేయండి.. ఆరోగ్యంగా ఉంటారని ఎస్పీ మణికంఠ చెప్పారు. సన్‌డే ఆన్ సైకిల్ కార్యక్రమాన్ని చిత్తూరు గాంధీ విగ్రహ కూడలి వద్ద ఆదివారం ఏఆర్ ఏఎస్పీ శివానంద కిశోర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఆధునిక సౌకర్యాల కారణంగా శారీరక చురుకుదనం కొరవడి ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయన్నారు. రోజూ కనీసం 30 నిమిషాలపాటు సైకిల్‌తొక్కడం ద్వారా శరీరానికి అవసరమైన వ్యాయామం లభిస్తుందన్నారు. మందులు వాడాల్సిన అవసరం ఉండదన్నారు. సైకిల్ ర్యాలీ ఎంఎస్ఆర్ కూడలి, చౌడేశ్వరమ్మ కూడలి, దర్గా కూడలి మీదుగా తిరిగి గాంధీ విగ్రహం కూడలి వద్దకు చేరుకుంది. ఎంటీవో చంద్రశేఖర్, ఆర్ఐ సుధాకర్, చిత్తూరు డీఎస్పీ సాయినాథ్, ఏఆర్ డీఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్ బాష, సీఐలు మహేశ్వర్, నెట్టికంఠయ్య, ట్రాఫిక్ సీఐ లక్ష్మీనారాయణ, యువతీ యువకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో నేడు 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి విజ్ఞప్తులను తీసుకుంటారని తెలిపారు. డివిజన్, మండలస్థాయిల్లోనూ పీజీఆర్ఎస్ నిర్వహించాలని సూచించారు.

- జిల్లా పోలీసు కార్యాలయంలోనూ సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్ఎస్ జరుగుతుందని ఎస్పీ మణికంఠ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాధిత ప్రజలు హాజరై సమస్యలను విన్నవించుకోవాలని కోరారు.

13 మండలాల్లో మోస్తరు వర్షం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావ కారణంగా గడిచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా 13 మండలాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. మండలాలవారీగా.. బైరెడ్డిపల్లెలో 45.6, నింద్రలో 24.2, గుడిపాలలో 7, కార్వేటినగరం, యాదమరిలో 6.6, నగరి, వి.కోటలో 6.2, చిత్తూరులో 2.2, శాంతిపురంలో 2, పలమనేరులో 1.6, గంగవరంలో 1.4, పుంగనూరులో 1.2, బంగారుపాళ్యంలో 0.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

నాడు వెలవెల.. నేడు బిరబిరా..!

- కుప్పానికి కృష్ణాజలాల రాకపై చర్చించుకుంటున్న జనం

ఆ తల్లి కష్టం ఫలించింది

- నలుగురు ఆడబిడ్డలను వరించిన ప్రభుత్వ ఉద్యోగాలు
- ఇద్దరు పోలీసులు, ఇద్దరు టీచర్లయ్యారు

బార్ లైసెన్స్‌లకు దరఖాస్తులు నిల్

- ఇక రెండ్రోజులే గడువు

- వివరాలు 7లో -

స్పోర్ట్స్ సిటీగా తిరుపతి

30 ఎకరాల కేటాయింపు

'అమరావతి ఛాంపియన్‌షిప్' క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో మంత్రి రాంప్రసాద్ రెడ్డి



క్రీడాజ్యోతితో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, సినీనటుడు రోహిత్, శాప్ చైర్మన్ రవినాయుడు తదితరులు

తిరుపతి/తిరుపతి (క్రీడలు), ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతిని స్పోర్ట్స్ సిటీగా మారుస్తాం. ఇప్పటికే స్పోర్ట్స్ సెంటర్‌కోసం దామినేడు దగ్గర 30 ఎకరాలు కేటాయించాం అని రాష్ట్ర మంత్రి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతిలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం 'అమరావతి ఛాంపియన్‌షిప్' రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను మంత్రి ప్రారంభించారు. డీఎస్సీలో అర్హత సాధించిన 18వేల మందిలో దాదాపు 450 మందికి క్రీడా కోటల్లో టీచర్ ఉద్యోగాలు దక్కాయని గుర్తుచేశారు. ఎక్కడా రాజీపడకుండా క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామన్నారు. తన తండ్రి (రామ్మూర్తి నాయుడు) ఆలిండియా కబడ్డీ చైర్మన్‌గా చేశారని, పెదనాన్న (చంద్రబాబు) స్పోర్ట్స్‌కు పెద్దపీట వేస్తుంటారని సినీ నటుడు నారా రోహిత్ అన్నారు. ఇక్కడి క్రీడాకారులు దేశానికి పతకాలు తీసుకొచ్చే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. గతంలో స్పోర్ట్స్ డే అంటే ర్యాలీ చేసి, ఒకరిద్దరి ఆటగాళ్లకు సన్మానాలు చేసి ముగించేవారని శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు. ఈసారి మంత్రి చొరవతో అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మూడు రోజులపాటు నిర్వహించే పోటీలకు దాదాపు 1,300 మంది క్రీడాకారులు వచ్చారని శాప్ ఎండీ గిరీషా అన్నారు. అమరావతి చాంపియన్‌షిప్‌ను రెగ్యులర్ ఈవెంట్‌గా మార్చేందుకు శాప్ తీర్మానం చేసిందన్నారు. గ్రామీణ క్రీడాకారులను వెలికితీయాలనే లక్ష్యంతో ఇలాంటి ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నారని కలెక్టర్ వెంకటేశ్వర్ చెప్పారు.

పోటా పోటీగా.. : మంత్రితో పాటు పలువురు అతిథులు డమ్మీ గన్‌పేల్చి అథ్లెటిక్స్‌ను ప్రారంభించారు. వివిధ వేదికలలో ఏర్పాటుచేసిన క్రీడలు సాయంత్రం వరకు కొనసాగాయి. ఎస్వీయూ మైదానంలో అథ్లెటిక్స్, ఖోఖో.. ఎస్వీయూ క్యాంపస్ గ్రౌండ్‌లో బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్, బాస్కెట్‌బాల్.. ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ క్యాంపస్ స్కూల్ గ్రౌండ్‌లో వాలీబాల్, ఆర్చరీ.. శ్రీనివాస క్రీడా సముదాయంలో కబడ్డీ, బ్యాడ్మింటన్.. ఎస్వీఆర్ట్స్ కాలేజీ మైదానంలో హాకీ పోటీలు జరిగాయి.

హంద్రీ- నీవా కాలువ లీకేజీకి అడ్డుకట్ట



హంద్రీ-నీవా కాలువ లీకేజీని మట్టితో పూడ్చుతున్న అధికారులు

శాంతిపురం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండల పరిధిలోని గుండిశెట్టిపల్లె సమీపంలో హంద్రీ- నీవా కాలువలో నీరు లీకేజీ గమనించిన అధికారులు వెంటనే మట్టితో అడ్డుకట్ట వేశారు. ఆదివారం ఉదయం 10 గంటలకు గుండిశెట్టిపల్లె సమీపానికి కృష్ణా జలాలు చేరుకున్నాయి. అక్కడ పైపుల నుంచి కాలువలోకి నీరు ప్రవహించాలి. పైపుకు, కాలువకు మధ్యన సిమెంట్‌తో కాంక్రీట్ సరిగా వేయకపోవడంతో నీరు లీకేజీ అవుతుండటాన్ని అక్కడున్న ప్రజలు గమనించారు.నేతల ద్వారా అధికారులకు సమాచారం ఇచ్చారు. స్పందించిన అధికారుల లీకేజీ అవుతున్న ప్రదేశంలో మట్టి వేసి.. ఆపారు.

బార్ లైసెన్స్‌లకు దరఖాస్తులు నిల్

● ఇక రెండ్రోజులే గడువు

చిత్తూరు సిటీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బార్ లైసెన్స్‌లకు ఇప్పటి వరకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. మంగళవారం సాయంత్రం ఐదు గంటలతో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగియనుంది. అలాగే గీత కులాల వారికి 29వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తులు ఆహ్వానించారు. సోమ, మంగళవారాల్లో దరఖాస్తులు రావచ్చని ఎక్సైజ్ అధికారులు భావిస్తున్నారు.

జగన్ పర్యటనకు రెండ్రోజుల ముందు...





జగన్ పర్యటనకు రెండ్రోజుల ముందు రాజుపేటకు ఎగువన అడ్డుకట్ట వేసి నిల్వ చేసిన నీరు - రాజుపేట వద్ద జలాలు విడుదల కోసం ఏర్పాటు చేసిన గేటు (ఫైల్‌ఫొటోలు)



ఆదివారం రాజుపేట వద్ద హంద్రీ-నీవా కాలువలో ప్రవహిస్తున్న కృష్ణాజలాలు

నాడు వెలవెల.. నేడు బిరబిరా..!

● కుప్పానికి కృష్ణాజలాల రాకపై చర్చించుకుంటున్న జనం

రామకుప్పం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గ సరిహద్దు రామకుప్పం మండలం వర్తికుప్పం వద్ద హంద్రీ-నీవా కాలువలోకి శనివారం అర్ధరాత్రి ప్రవేశించిన కృష్ణా జలాలు ఆదివారం రాత్రికి గుడుపల్లె మండల సరిహద్దుకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికల ముందు కుప్పానికి కృష్ణా జలాలు ఇస్తున్నామంటూ వైసీపీ ప్రభుత్వం చేసిన హంగామాను జనం గుర్తు చేసుకుంటున్నారు. అప్పట్లో కొద్ది కిలోమీటర్లు కూడా జలాలు ప్రవహించలేదని.. నేడు కృష్ణమ్మ వేగంగా కదులుతూ కుప్పం నియోజకవర్గ చివరి ప్రాంతమైన పరమసముద్రం చెరువు వైపు పరుగులు తీస్తోందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2017లో టీడీపీ ప్రభుత్వం రూ.485కోట్లతో హంద్రీ-నీవా కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులను ప్రారంభించింది. 2019 ఎన్నికల నాటికి 83శాతం పనులు పూర్తయ్యాయి. అప్పట్లో వైసీపీలో నియోజకవర్గస్థాయిలోని ప్రముఖ నేత ప్రోద్బలంతో కొందరు రైతులు కోర్టులో కేసులు వేయడంతో కొన్ని చోట్ల పనులు అసంపూర్తిగా ఉండిపోయాయి. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కాలువ పనులు పూర్తిగా ఆగిపోయాయి. నాలుగేళ్లు మీనమేషాలు లెక్కించిన వైసీపీ ప్రభుత్వం, గత సార్వత్రిక ఎన్నికలకు కొన్ని నెలల ముందు హడావిడిగా పనులు పూర్తి చేసి చేతులు దులుపుకుంది. ఎన్నికలు మూడు నెలల్లో జరుగుతాయనగా అప్పటి సీఎం జగన్ హడావిడిగా కుప్పానికి హంద్రీ-నీవా జలాలు ఇస్తున్నామంటూ రామకుప్పం మండలం రాజుపేట వద్ద బటన్ నొక్కారు. కానీ 24గంటలు తిరక్కముందే జలాలు కొన్ని కిలోమీటర్లు ప్రవహించి కాలువలో జలాలు లేక వెలవెలబోయింది. జగన్ బటన్ నొక్కడానికి వచ్చే రెండ్రోజుల ముందు రాజుపేట ఎగువ భాగాన కాలువకు అడ్డుకట్ట వేసి జలాలు నిలువరించారు. ఆయన బటన్ నొక్కేందుకు వచ్చే ముందు రోజు అడ్డుకట్టను తొలగించి, నీరు వదిలారు. కుప్పం నియోజకవర్గంలో కేవలం నాలుగైదు కిలోమీటర్లు మాత్రమే, అది కూడా ఒకటి, రెండు అడుగుల మేర జలాలు ప్రవహించాయి. పైగా రామకుప్పం మండలం దాటి శాంతిపురంలోకే చేరలేదు. అంతేకాకుండా జగన్ బటన్ నొక్కిన చోట ఏర్పాటు చేసిన గేటును రెండ్రోజులు గడవక ముందే తొలగిస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దాంతో గేటును యథాస్థానంలో అమర్చారు. ఎన్నికల్లో లబ్ధి కోసం సినిమా సెట్టింగులు వేసి జనాన్ని జగన్ మోసం చేశారని అప్పట్లో చంద్రబాబుసహా టీడీపీ శ్రేణులు ఆరోపించాయి. ఇక చంద్రబాబు సీఎం అయ్యాక ఏడాదిలోనే కృష్ణాజలాలను కుప్పానికి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీని నెరవేర్చారని జనం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాజుపేట వద్ద బిరబిరా పరుగెడుతున్న కృష్ణాజలాలకు ఆదివారం ఉదయం 11.30గంటలకు టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజనేయరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు జలహారతి ఇచ్చారు. మధ్యాహ్నం 12గంటలకు రామకుప్పం మండలం దాటి శాంతిపురం మండలంలోకి కృష్ణాజలాలు ప్రవేశించాయి.

ఆ తల్లి కష్టం ఫలించింది

● పేద కుటుంబంలోని నలుగురు ఆడబిడ్డలను వరించిన ప్రభుత్వ ఉద్యోగాలు

● ఇద్దరు పోలీసులు, ఇద్దరు టీచర్లయ్యారు



తల్లి గౌరమ్మతో ఉద్యోగాలు పొందిన కుమార్తెలు వీణాకుమారి, వాణి, వనజాక్షిణి, శిరీష

పుంగనూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఆ తల్లి కష్టం ఫలించింది. పేద కుటుంబంలో నలుగురు ఆడబిడ్డలను ప్రభుత్వ ఉద్యోగాలు వరించాయి. ఇద్దరు పోలీసులవగా, మరో ఇద్దరు టీచర్లు అయ్యారు. పుంగనూరు మండలం పాళ్యంపల్లె పంచాయతీ వేపమాకులపల్లెకు చెందిన సీతప్పగారి మునివెంకటప్ప, గౌరమ్మలకు నలుగురు ఆడ పిల్లలు (వీణాకుమారి, వాణి, వనజాక్షిణి, శిరీష) ఉన్నారు. భర్త పదేళ్ల కిందట చనిపోయాడు. బిడ్డలకు తండ్రిలేని లోటు తీర్చాలని గౌరమ్మ నిశ్చయించింది. పేద కుటుంబం కావడంతో వ్యవసాయ, కూలీ పనులు చేసి పిల్లలను చదివించింది. పిల్లలు కూడా పట్టుదలతో ఉన్నత విద్య అభ్యసించారు. పెద్ద కుమార్తె వీణాకుమారి.. 2014లో జరిగిన పోలీస్ రిక్రూట్‌మెంట్ పరీక్షల్లో మహిళా పోలీస్‌గా ఎంపికై అన్నమ్మయ్య జిల్లా మదనపల్లెలో పనిచేస్తున్నారు. రెండో కుమార్తె వాణి గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి 2016లో ఎస్జీటీ ఉపాధ్యాయురాలిగా ఎంపికై ప్రస్తుతం వి.కోటలో పనిచేస్తున్నారు. మూడో కుమార్తె వనజాక్షిణి డిగ్రీవరకు పుంగనూరులో చదివి ఎమ్మెస్సీ తిరుపతిలో పూర్తిచేయగా.. ఇటీవల రాసిన పరీక్షలో ప్రతిభ చూపి.. పోలీసు ఉద్యోగానికి ఎంపికైంది. సోమవారం చిత్తూరులో సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకానుంది. చివరి బిడ్డ శిరీష డిగ్రీ పూర్తి చేసి తాజాగా విడుదలైన మెగా డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీగా ఎంపికయ్యారు. ఇంట్లో నలుగురు ఆడపిల్లలూ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంపై ఆ కుటుంబాన్ని గ్రామస్తులు అభినందించారు. ఇప్పుడు మా తండ్రి ఉంటే చాలా సంతోషపడేవాడని, మా అమ్మ కష్టాన్ని ఎప్పటికీ మర్చిపోలేమని ఆ పిల్లలు తెలిపారు.

ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో డీఎస్సీ ఉచిత శిక్షణ

15 మంది టీచర్లుగా ఎంపిక

కుప్పం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు అక్షరాస్యతలో అత్యంత వెనుకబడిన ప్రాంతమైన కుప్పం నియోజకవర్గం ఇప్పుడు చదువును బోధించే గురువులకు కేంద్ర స్థానంగా మారుతోంది. ఉపాధ్యాయ శిక్షణ పొందిన యువతను మరింతగా మెరుగులు పెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ముందుకొచ్చారు. ఆమె మేనేజింగ్ ట్రస్టీగా వ్యవహరిస్తున్న ఎన్టీఆర్ ట్రస్టు తరపున కుప్పం నడిబొడ్డున డీఎస్సీ ఉచిత శిక్షణ కేంద్రం తెరిచారు. ఇందులో కుప్పం నియోజకవర్గంలో ఉపాధ్యాయ శిక్షణ పొందిన యువతకు ఉచితంగా శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ తీసుకున్న యువతలో ఏకంగా 15 మందికిపైగా డీఎస్సీలో మెరిట్ సాధించి ఉపాధ్యాయులుగా అవకాశం పొందారు. కుప్పం మండలం గుడ్లనాయనిపల్లె గ్రామం వ్యవసాయ కుటుంబానికి చెందిన మీనా 88.49 మార్కులు (16వ ర్యాంకు), వడ్డి గొల్లపల్లెకు చెందిన తాపీ మేస్త్రీ మల్లప్ప కుమారుడు 86.66 మార్కులు (42వ ర్యాంకు), గుడుపల్లె మండలం అగరం గ్రామానికి చెందిన సచివాలయ ఉద్యోగిగా పనిచేస్తున్న శోభ 83.24 మార్కులు, కుప్పం పట్టణంలో పేద కుటుంబానికి చెందిన పూజ 79.6 మార్కులు, వజ్రవేలుశెట్టి వీధికి చెందిన కార్పెంటర్ కుమార్తె ప్రియాంకకు 78.18 మార్కులు, కుప్పం మండలం పెద్దగోనపల్లెకు చెందిన లీలావతి 75.96 మార్కులతో ఉపాధ్యాయులయ్యారు.



లీలావతి, శివకుమార్, పూజ, తల్లిదండ్రులతో ప్రియాంక

అలాగే కుప్పం మండలం పరమసముద్రం గ్రామానికి చెందిన సంధ్య, శాంతిపురం మండలం మొరసనపల్లెకు చెందిన రేవతి, గుడుపల్లె మండలం యామగానిపల్లెకు చెందిన శ్రీనివాసులు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులైన అభ్యర్థులు మాట్లాడుతూ.. తమకీ అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబుకు, ఆయన సతీమణి భువనేశ్వరికి ధన్యవాదాలు తెలిపారు.



శ్రీనివాసులు - రేవతి - లీలావతి

ఒకటిన్నర కిలోల గంజాయి స్వాధీనం

● ఇద్దరు విక్రేతల అరెస్టు

చిత్తూరు అర్బన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఒకటిన్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరు విక్రేతలను అరెస్టు చేశారు. రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య తెలిపిన వివరాల మేరకు.. ఎస్పీ మణికంఠకు గంజాయి విక్రయిస్తున్నారని సమాచారం అందడంతో రెండో పట్టణ పోలీసులకు ఆదేశాలిచ్చారు. రంగంలోకి దిగిన పోలీసులకు జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటర్‌కు ఎదురుగా ఉన్న ఓ ప్రైవేటు పాల డెయిరీ సమీపంలో బీడుభూముల వద్ద రోస్నీ నగర్‌కు చెందిన గణేష్, లోకేష్ అనుమానాస్పదంగా కనిపించడంతో పట్టుకున్నారు. విచారించగా గంజాయి విక్రయిస్తున్నట్లు తేలింది. దాంతో వారి వద్ద నుంచి ఒకటిన్నర కిలోల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు, రెండు సెల్‌ఫోన్లను సీజ్ చేసి, నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరికి గంజాయిని విక్రయించిన బంగారుపాళ్యం మండలం తుంబకుప్పంకు చెందిన బడా స్మగ్లర్ కోసం పోలీసులు వేట ప్రారంభించారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

● 40గ్రాముల బంగారు, 750 గ్రాముల వెండి అపహరణ

శ్రీరంగరాజపురం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఓ పట్టపగలే ఇంట్లో చోరీ జరిగింది. 40గ్రాముల బంగారు, 750 గ్రాముల వెండి ఎత్తుకెళ్లారు. ఎస్ఐ సుమన్ తెలిపిన వివరాల మేరకు.. ఎస్ఆర్‌పురం మండలంలోని గంగమ్మగుడి గ్రామంలో చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారి పక్కన ఉన్న ఇంట్లో చిట్టి నాయుడు కుటుంబం నివాసం ఉంటోంది. శనివారం ఇంటికి తాళం వేసి కావడి తీసుకుని కుటుంబీకులతో కలిసి తిరుత్తణి సుబ్రహ్మణ్యేశ్వరుడి ఆలయానికి వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చేసరికి తలుపులు పగులకొట్టి ఉన్నాయి. లోపలికెళ్లి చూడగా బీరువాను పగలకొట్టి అందులో ఉన్న 40 గ్రాముల బంగారు, 750 గ్రాముల వెండి ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆదివారం క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు సేకరించింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



దొంగల వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

'డీఎస్సీ'లో గ్రంథాలయ పాఠకుడి ప్రతిభ



రంగనాథ్‌ను సన్మానిస్తున్న గ్రంథాలయాధికారి హేమకుమార్ తదితరులు

పలమనేరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని గ్రంథాలయానికి క్రమం తప్పకుండా వెళ్లి అక్కడి పోటీపరీక్షల పుస్తకాలను చదువుకుంటూ డీఎస్సీ పరీక్షలో 9వ ర్యాంకు సాధించిన రంగనాథ్‌ను ఆదివారం శాఖా గ్రంథాలయంలో సన్మానించారు. పలమనేరు రచయితల సంఘ సంయుక్త కార్యదర్శి జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, జిల్లా రైతు సంఘ నాయకులు ఉమాపతి నాయుడు, శ్రీపురం సీతారామయ్య, మల్లిచెట్ల దేవేంద్ర, యుగంధర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రైతుబిడ్డ అయ్యోరయ్యాడు

కుప్పం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం పెద్దకురబలపల్లెకు చెందిన ఎస్.రమేష్ 86.36 మార్కులు సాధించి, 52వ ర్యాంకర్‌గా నిలిచి ఎస్జీటీ (సెకండరీ గ్రేడ్ టీచర్) ఉద్యోగం పొందాడు. రమేష్ తల్లి దండ్రులు సుబ్బరాయప్ప, సుబ్బమ్మలు వ్యవసాయదారులు.



రమేష్

టీచర్లయిన దంపతులు

బంగారుపాళ్యం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండలంలోని టేకుమందకు చెందిన జనార్దన్, నిరుపమ దంపతులు టీచర్లయ్యారు. జనార్థన్ ఎస్జీటీ విభాగంలో 85.18 మార్కులు సాధించి జిల్లాలో 85వ స్థానంలో నిలిచాడు. నిరుపమ ఎస్ఏ ఇంగ్లీష్‌లో 73.95 మార్కులతో 44వ స్థానంలో నిలిచింది. వీరిని గ్రామస్తులు అభినందించారు.



జనార్థన్, నిరుపమ

గ్లోబల్ హెల్త్‌కేర్ క్యాపిటల్‌గా భారత్

● అపోలో చైర్మన్ ప్రతాప్ సీ రెడ్డి

చిత్తూరు రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో ప్రపంచ హెల్త్‌కేర్ క్యాపిటల్‌గా భారత్ అవతరిస్తుందని అపోలో హాస్పిటల్స్ వ్యవస్థాపక చైర్మన్ ప్రతాప్ సీ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఆదివారం చిత్తూరు అపోలో యూనివర్సిటీలో విద్యార్థులు, అధ్యాపకులతో ముఖాముఖి నిర్వహించారు. ఆయన మట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా భారత వైద్యులు అమెరికాలో దాదాపు 10 శాతం, యూకేలో 25-30 శాతం వరకు హెల్త్ రంగంలో కీలక స్థానాలు దక్కించుకున్నారన్నారు. ఇది మన వైద్యుల ప్రతిభ, నిబద్ధతకు నిదర్శనమని చెప్పారు. హెల్త్‌కేర్‌లో అత్యాధునిక టెక్నాలజీని దేశానికి తేవడంలో తాము ఎప్పుడూ ముందుంటామని తెలిపారు. ఇప్పటికే కార్డియాలజీ రంగంలో ప్రపంచ అగ్రగామిగా అపోలో నిలిచిందన్నారు. ముఖ్యంగా క్యాన్సర్ చికిత్సలో కీలకమైన ప్రోటాన్ టెక్నాలజీని ఢిల్లీ, హైదరాబాద్‌లలో ఏర్పాటు చేశామని వివరించారు. హెల్త్‌కేర్ అంటే కేవలం మందులు మాత్రమే కాదని, టెక్నాలజీ, ప్రివెంటివ్ కేర్, ఎమర్జెన్సీ సేవలు కూడా సమానంగా అవసరమన్నారు. అపోలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ వినోద్‌భట్, రిజిస్ట్రార్ పోతురాజు, డీఎన్ ఆల్ఫ్రెడ్ జే అగస్టిన్, సీవోవో నరేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.





అధ్యాపకులు, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న అపోలో చైర్మన్ ప్రతాప్ సీ రెడ్డి

భక్తులతో బోయకొండ కిటకిట



చౌడేపల్లె, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. గంగమ్మ ఆలయానికి ఉదయం నుంచే ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.



అమ్మవారి దర్శనం కోసం వేచియున్న భక్తులు

ఎస్సీ వర్గీకరణతో ఐక్యతను దెబ్బతీసే కుట్ర

● మాల మహానాడు



మీడియాతో మాట్లాడుతున్న రత్నాకర్

చిత్తూరు సిటీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ పేరిట దళితుల ఐక్యతను దెబ్బతీయడానికి దేశవ్యాప్త కుట్ర జరుగుతోందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రత్నాకర్ ఆరోపించారు. ఆదివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లో అన్ని రాజకీయ పార్టీలు మాల సామాజిక వర్గంపై కత్తిగట్టాయని చెప్పారు. ఎస్సీ వర్గీకరణపై మాజీ సీఎం జగన్ కనీసం నోరు మెదపకపోవడం దురదృష్టకరమని అన్నారు. ఎస్సీ వర్గీకరణ కుట్రలో సీఎం చంద్రబాబు భాగస్వాములుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ తప్పు అని, ఈ నిర్ణయాన్ని వెనక్కితీసుకోవాలని డిమాండ్ చేశారు. నేతలు దేవ, ఉదయ్‌కుమార్, సంతోష్‌కుమార్, కృష్ణ, బుల్లెట్ బాబు, ఏసు తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి బ్రహ్మోత్సవ వాల్‌పోస్టర్లలో మండలం పేరెక్కడ?: బీజేపీ

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్లలో ఐరాల మండలం పేరును ముద్రించక పోవడం దారుణమని బీజేపీ మండల మాజీ అధక్షుడు అయిరాల రాజేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల కిందట కూడా ఇలాగే మండలం పేరు లేకుండా ముద్రించారని చెప్పారు. అప్పటి అధికారులను ప్రశ్నించగా.. వెంటనే మార్పు చేసి ముద్రించారన్నారు. ప్రస్తుతం జరిగిన దానికి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వచ్చే ఏడాది నుంచి ఇలాంటివి జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

జీజేసీ బోధనేతర ఉద్యోగుల నూతన కార్యవర్గం

జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా విశ్వేశ్వర్‌రెడ్డి, మాధవ్‌నివాస్

తిరుపతిరూరల్, ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఉమ్మడి చిత్తూరు జిల్లా బోధనేతర ఉద్యోగుల సంఘ నూతన కార్యవర్గాన్ని ఎమ్మార్‌పల్లెలోని యూత్ హాస్టల్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కందాటి విశ్వేశ్వర్‌రెడ్డి(శ్రీకాళహస్తి), అసోసియేట్ అధ్యక్షుడిగా అబ్దుల్ నజీర్(చిత్తూరు), కార్యదర్శిగా పి.మాధవ్‌నివాస్(చంద్రగిరి), ఆర్గనైజింగ్ సెక్రటరీగా మునిశంకర్‌రెడ్డి(చంద్రగిరి), మహిళా కార్యదర్శిగా శిరీష(వరదయ్యపాళెం), కోశాధికారిగా టి.సాయితేజ(పీఎన్‌పేట), ఉపాధ్యక్షులుగా కె.చరణ్‌కుమార్, కె.ప్రతాప్‌గాంధీ, టి.మంజునాథ్, కె.లక్ష్మీనారాయణ, సంయుక్త కార్యదర్శులుగా పి.ప్రసాద్, ఎం.రాజశేఖరరెడ్డి, వై.మనోజ్‌రెడ్డి, బీవీ రాఘదీప్తిలను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ ప్రతినిధులను పలువురు అభినందించారు.

ఇంటర్ విద్య జేఏసీ చైర్మన్‌గా రవి

ఇంటర్మీడియట్ విద్య(జీజేసీ) జేఏసీ చైర్మన్‌గా ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వి.రవి, కోచైర్మన్‌గా ప్రిన్సిపాళ్ల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి.గోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ మురళీకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బి.మాధవరావు, కె.విశ్వేశ్వర్‌రెడ్డిలను ఎన్నుకున్నారు.



నూతనంగా ఎన్నికైన నాన్‌టీచింగ్ సంఘ కార్యవర్గ ప్రతినిధులు, పక్కన అతిథులు

పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు న్యాయం



ప్రజాదర్బార్‌లో పాల్గొన్న చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గంలో ఎన్నిక సమయంలో పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేయడమే లక్ష్యంగా పని చేస్తానని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామ చంద్రారెడ్డి అన్నారు. ఆదివారం రొంపిచెర్లలో ఇంటి వద్ద ప్రజా దర్బార్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సోమల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు కందూరు బస్టాండ్ వద్ద ఉన్న పశువైద్యశాల పురాతన భవనం శిథిలావస్థకు చేరకుందని.. ఈ భవనాన్ని తొలగించేందుకు చర్యలు తీసకోవాలని కోరారు. వల్లిగట్ల సమీపంలో సోమప్పచెరువు తెగిపోయి ఏళ్ల గడుస్తున్నా ఎలాంటి మరమ్మతు చర్యలు తీసుకోలేదని చల్లాబాబు దృష్టికి తెచ్చారు. సోమల మార్కెట్ కమిటీలో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం వసతులు కల్పించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ కరణం శ్రీనివాసులు నాయుడు తెలిపారు. అలాగే పలు సమస్యలను ప్రజాదర్బార్‌లో విన్నవించారు. పుంగనూరు టీడీపీ అధ్యక్షుడు మధవరెడ్డి, సోమల మాజీ వైస్‌ఎంపీపీ ఉమాపతినాయుడు, టీడీపీ నాయకులు రమేష్, ధనంజయనాయుడు, మురళీనాయుడు, లక్ష్మీపతినాయుడు, కుమార్‌రెడ్డి, దేవులపల్లె చెంగల్‌రెడ్డి, రఘునాథ్, అమరనాథరెడ్డి చంద్ర పాల్గొన్నారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు



మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

సోమల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సోమల మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో రూ.6 లక్షల వ్యయంతో నిర్మించిన మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. మండల నిధులతో నిర్మించి మరుగుదొడ్లకు నీటి సౌకర్యం లేకపోవడం, ముళ్లపొదలు కమ్ముకు పోయిదారి కూడా లేకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాల వద్దకు వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి మరుగుదొడ్లకు నీటి సౌకర్యం, దారిలో ఉన్న ముళ్ల పొదలను తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు. నిత్యం వెలుగు కార్యాలయానికి వచ్చే మహిళలు, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయం, సచివాలయ, రైతు సేవాకేంద్రాలకు వచ్చే ప్రజల దృష్యా అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఆలయ భూముల అన్యాక్రాంతంపై ఫిర్యాదు



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న హిందూజాగృతి సభ్యులు

సోమల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలోని పలు ఆలయ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని బీజేపీ మండల అధ్యక్షుడు హేమగిరి, హిందూజాగృతి సభ్యులు దేవాదాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం ఆవులపల్లె సమీపంలోని సోమేశ్వరస్వామి ఆలయం భూముల కౌలుకు వేలం నిర్వహించారు. ఈక్రమంలోనే ఆలయ భూముల వివరాలు తెలపాలని అధికారులను కోరారు. అధికారులు సమగ్ర వివరణ ఇవ్వకపోవడంతో వేలం వాయిదా వేశారు. పెద్దఉప్పరపల్లె, ఆవులపల్లె, అన్నెమ్మగారిపల్లె పంచాయతీల్లోని పలు ఆలయాల భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని.. వందల ఎకరాల భూములు ఏమయ్యాయని వాపోయారు. ఆక్రమణకు గురైన భూములను స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఈనెల 30న వేలం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కోదండరాజు, వేణుగోపాల్ నాయుడు, రాజ్‌కుమార్, ప్రేమకుమార్, రంగయ్యశెట్టి, కరుణాకర్ నాయుడు, గంగయ్య, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

పలమనేరుకు చేరిన ఆలయ ధ్వజస్తంభం



పలమనేరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పలమ నేరులోని కాశీవిశ్వే శ్వర స్వామి ఆలయంలో ప్రతిష్ఠించేందుకు కేరళ నుంచి బయలు దేరిన ధ్వజ స్తంభం ఆదివారం పలమనేరుకు చేరుకొంది. సుమారు 50 అడుగుల పొడవున ఉన్న ఈ ధ్వజస్తంభాన్ని కేరళలోని అటవీ ప్రాంతం నుంచి కొనుగోలు చేసి ఇక్కడికి తీసుకొచ్చినట్లు ఎండోమెంట్ అధికారులు తెలిపారు. ఇప్పటికే కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ గోపుర నిర్మాణం జరుగుతోంది. ఆలయ గాలిగోపుర నిర్మాణం పూర్తికాగానే జరిగే మహాకుంభాభిషేకం సందర్భంగా ఈ నూతన ధ్వజస్తంభాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించనున్నట్లు అధికారులు తెలిపారు. కేరళ నుంచి పలమనేరుకు చేరుకునేందుకు కొనుగోలు ధరతో దాదాపు రూ.6 లక్షలు వ్యయం అయినట్లు సమాచారం. స్థానికులు విరాళంగా అందజేశారు.

చికిత్స పొందుతూ తల్లీకొడుకుల మృతి





చిన్నపాపమ్మ (ఫైల్ ఫొటో), చికిత్స పొందుతూ మృతి చెందిన గంగిరెడ్డి

పెద్దపంజాణి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దవెలగటూరు పంచాయతీ సంపల్లె గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మోహన్‌రెడ్డికి మాతృ, సోదర వియోగం కలిగింది. గత సోమవారం పుంగనూరు నుంచి పెద్దవెలగటూరుకు ఆటోలో వస్తుండగా కత్తార్లపల్లె వద్ద ఎదురుగా టిప్పర్ వచ్చి ఢీకొంది. ప్రమాదంలో 8 మంది గాయపడగా సంపల్లెకు చెందిన చిన్నపాపమ్మ(72), ఆమె కుమారుడు గంగిరెడ్డి (54) తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వీరిని పంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి పంపారు. అక్కడ చికిత్స పొందుతూ చిన్నపాపమ్మ మృతి చెందారు. తల్లికి అంత్యక్రియలు చేసి వస్తుండగా సోదరుడి మరణవార్త విన్న మోహన్‌రెడ్డి, కుటుంబ సభ్యులు కుప్పకూలిపోయారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఫోన్ ద్వారా మోహన్‌రెడ్డిని పరామర్శించారు.

7న పలమనేరులో 'పుస్తకంతో నడక'



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న రచయితలు, సాహితీ ప్రియులు

పలమనేరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులో సెప్టెంబరు 7న పుస్తకంతో నడక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పలమనేరు రచయితల సంఘం సంయుక్త కార్యదర్శి జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. ఆదివారం పలమనేరులోని శాఖా గ్రంథాలయం వద్ద కుప్పం రెడ్డెమ్మ పురస్కారం గ్రహీత లక్ష్మీశ్రీనివాస్ కవితా సంపుటి సాహితీ పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం ప్రాముఖ్యత, ప్రయోజనాలను గురించి అవగాహన కల్పిస్తూ పుస్తకంతో నడక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు యుగంధర్, గ్రంథాలయాధికారి హేమకుమార్, తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి.తులసినాథంనాయుడు, పండిత పరిషత్ ఉపాధ్యాయులు హైదర్, శివాడి. దనంజయులు, సీతారామయ్య, దేవేంద్ర, సిద్ధార్థ, చంద్రశేఖరయ్య, తదితరులు పాల్గొన్నారు.

28న తెలుగు భాషోత్సవాలు

పలమనేరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ఈనెల 28న ముందస్తుగా పలమనేరు కళామందిరంలో తెలుగు భాషోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు పి. తులసినాథంనాయుడు, పి.పుష్ప ఓ ప్రకటనలో తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 242 మంది పిల్లలు వ్యాసాలు రాసి పంపారని.. వారిలో 100 మందికి, వందకు పైగా పద్యాలు చెప్పే 50 మంది పిల్లలకు బహుమతులు అందజేస్తామన్నారు. భాషాభిమానులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు గంగమ్మ ఆలయ కుంభాభిషేక మహోత్సవం

రామకుప్పం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణం ప్రధాన గ్రామదేవత దిగువవీధి గంగమ్మ ఆలయ కుంభాభిషేక మహోత్సవం సోమవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం కలశ స్థాపనతో కుంభాభిషేక మహోత్సవానికి వేద పండితులు అంకురార్పణ చేస్తారన్నారు. కలశస్థాపన అనంతరం అమ్మవారిక ప్రత్యేక అభిషేక పూజలు, మహాచండీ యాగం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రేపు మరుగుదొడ్ల అవకతవకలపై విచారణ

కల్లూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు పంచాయతీలో 2018 లో జరిగిన వ్యక్తిగత మరుగుదొడ్ల అవకతవకలపై పంచాయతీరాజ్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు కల్లూరు సచివాలయం-2లో ఈనెల 26వ తేదీన ఉదయం 10.30 గంటలకు డీఎల్‌డీవో రవికుమార్ 51 మంది లబ్ధిదారులను విచారించడం జరుగుతుందని కల్లూరు పంచాయతీ కార్యదర్శి నాగరాజు తెలిపారు. ఈ విచారణకు హాజరు కావాలని వ్యక్తిగత మరుగుదొడ్ల లబ్ధిదారులకు నోటీసులు అందజేసినట్లు పేర్కొన్నారు.

ఘనంగా రామకృష్ణారెడ్డి వర్ధంతి



సమాధి వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

చౌడేపల్లె, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మాజీ మండలాధ్యక్షులు, బోయకొండ మాజీ చైర్మన్ గువ్వల రామకృష్ణారెడ్డి వర్ధంతిని స్థానిక టీడీపీ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం మండలంలోని తెల్లనీళ్ళపల్లెలో ఆయన సమాధి వద్ద ఆయన తనయుడు టీడీపీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే మండలంలోని పలువురు టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్థానిక బస్టాండులో అన్నదానం నిర్వహించారు.

గణేష్ ఉత్సవాల నిర్వహణకు అనుమతులు తప్పనిసరి

సోమల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గణేష్ మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతులు తప్పక తీసుకోవాలని ఎస్‌ఐ శివశంకర తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు ఈనెల 27 నుంచి ప్రారంభం కానుండటంతో మండపాలు, పందిళ్లకు పోలీసుల అనుమతి పొందాలని కోరారు.

కేంద్ర మంత్రిని కలిసిన పుంగనూరు బీజేపీ నేత



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన పుంగనూరు బీజేపీ నాయకులు

పుంగనూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని పుంగనూరు బీజేపీ నాయకుడు నానబాల కుమార్ మర్యాద పూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఆదివారం రేణిగుంట విమానాశ్రయంలో ఆయనను కలసి పుంగనూరు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

కందూరు వారపు సంతలో సెల్‌ఫోన్ల చోరీ

సోమల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం కందూరు లో ఆదివారం జరిగిన వారపు సంతలో ముగ్గురి సెల్‌ఫోన్లు దొంగలు చాకచక్యంగా తస్కరించారు. సాయంత్రం 4 గంటలకు వారపు సంత సందడిగా ఉండటంతో కూరగాయలు కొనుగోలు చేస్తుండగా బురుజుపల్లెకు చెందిన ఆర్టిస్టు సిద్దాకు చెందిన రూ.40 వేలు విలువ చేసే సెల్‌ఫోన్‌ను దుండగులు తస్కరించారు. అలాగే కందూరుకు చెందిన ఇద్దరి సెల్‌ఫోన్లు చోరీ జరిగిందని స్థానికులు తెలిపారు. గత శనివారం జరిగిన సంతలోనూ దొంగలు సెల్‌ఫోన్లు చోరీ జ చేశారు. పోలీసులు దొంగలపై నిఘా ఉంచాలని కోరారు.

రాజుపేటలో కృష్ణమ్మకు జలహారతి

● కరువు నుంచి కుప్పానికి శాశ్వత విముక్తి : రామకుప్పం టీడీపీ నాయకులు



రామకుప్పం మండలం రాజుపేట వద్ద పరుగులు తీస్తున్న కృష్ణా జలాలు



రామకుప్పం మండలం రాజుపేట వద్ద కృష్ణమ్మకు జలహారతి కార్యక్రమంలో టీడీపీ నేతలు

రామకుప్పం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న కరువు కాటకాలకు సీఎం చంద్రబాబు హంద్రీ-నీవా కుప్పం కెనాల్‌తో శాశ్వత విముక్తి కల్పించారని టీడీపీ రామకుప్పం మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజనేయరెడ్డి తెలిపారు. శనివారం రాత్రి హంద్రీ-నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు వి.కోట మండలం నుంచి రామకుప్పం మండలం వర్థికుప్పానికి చేరుకున్నాయి. ఉదయానికి అవి మండల పరిధి రాజుపేటకు చేరాయి. అక్కడ టీడీపీ నేతలు, కార్యకర్తలు టపాకాయలు పేలుస్తూ కృష్ణమ్మకు పసుపు, కుంకుమలు, పుష్పాలు సమర్పించి జలహారతి ఇచ్చారు. అనంతరం కృష్ణమ్మకు చీర, సారెలు సమర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కుప్పం శాసన సభ్యుడిగా ఎన్నికైన చంద్రబాబు ఈ ప్రాంతంలో సాగు, తాగు నీటి సమస్యలకు చెక్ పెట్టే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. విరివిగా చెరువులు, చెక్ డ్యాంల నిర్మాణాలు చేపట్టి భూగర్భజలాలు పెంపు కోసం కృషి చేశారన్నారు. వర్షాభావ పరిస్థితులతో ఈ ప్రాంతంలో కరువు నెలకొనడంతో శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించారన్నారు. స్వర్గీయ ఎన్‌టీఆర్ తలపెట్టిన హంద్రీ-నీవా ప్రాజెక్టుతోనే కుప్పం ప్రాంతం సస్యశ్యామలమవుతుందని 2017లో చంద్రబాబు హంద్రీ-నీవా కుప్పం కెనాల్ ఏర్పాటుకు నడుం బిగించారని తెలిపారు. సుమారు రూ.500 కోట్లతో అప్పట్లో కాలువ పనులు ప్రారంభించి, 2019 నాటికి 83 శాతం పనులు పూర్తి చేయించారన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను నిర్లక్ష్యం చేసి ప్రజలను మోసగించిందన్నారు. 2024 ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు జగన్ సినిమా సెట్టింగ్ తరహాలో కుప్పానికి కృష్ణా జలాలు ఇచ్చినట్టు బటన్ నొక్కారన్నారు. ఎక్కడికక్కడ పనులు పెండింగ్‌లో ఉండటంతో ఆయన బటన్ నొక్కిన 24 గంటలకే కాలువలో నీరు లేక వెలవెలబోయిందన్నారు. 2024లో చంద్రబాబు సీఎంగా కుప్పంలో పర్యటించిన సందర్భంగా ఏడాదిలోపు కుప్పానికి హంద్రీ-నీవా కాలువ ద్వారా కృష్ణాజలాలను తీసుకొస్తానని హామీ ఇచ్చారని.. ఆ హామీని ఆయన నెరవేర్చారన్నారు. ఈ సందర్భంగా వారు చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్, సింగిల్‌విండో చైర్మన్ మహ్మద్‌రఫీ, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ సీతాపతి, తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శి వెంకటాచలం, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి రవిరెడ్డి, కో-ఇన్‌చార్జి నవీన్, యూనిట్ ఇన్‌చార్జీ వెంకటరమణ, మాజీ సర్పంచులు రామకృష్ణప్ప, సురేష్, పెరుమాళ్, బీజేపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి రాజసింహా, నేతలు సలాంసాబ్, పద్మనాభరెడ్డి, గంట్లరెడ్డి, ఆదిల్, అవినాశ్, టీవీరవి, బాలరాజు, సుబ్రీ, రఘువిజయ్‌కుమార్‌రెడ్డి, మంజునాథ్, నియాజ్, రామలింగారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మంజునాథరెడ్డి, శ్రీనాథరెడ్డి, ఆంజి, శ్రీరాములు, సురేష్, దయానంద్, కేశవరెడ్డి, రెడ్డిపురుషోత్తం, చిన్నసురేష్, జ్ఞానశేఖర్‌రెడ్డి, మురళీ తదితరులు పాల్గొన్నారు.



శాంతిపురం: గుండిశెట్టిపల్లె వద్ద కృష్ణమ్మ జలాలతో సంబరాలు చేసుకుంటున్న తెలుగు తమ్ముళ్లు, రైతులు



శాంతిపురం: సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎస్‌ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం

హంద్రీ-నీవా తూముల నుంచి చెరువులకు నీరు



దాసార్లపల్లె చెరువుకు తూము నుంచి వెళుతున్న హంద్రీ-నీవా నీరు

వి.కోట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం దాసార్లపల్లె, ముదిమడుగు చెరువులకు హంద్రీ-నీవా కాలువ తూముల నుంచి నీరు ప్రవహించింది. కాలువ నుంచి ఈ చెరువులకు నీటిని విడుదల చేసేందుకు తూములను ఏర్పాటు చేశారు. కాల్వ పనులు జరుగుతున్న నేపథ్యంలో తూములను పూర్తిగా మూసివేయకపోవడంతో ఈ రెండు చోట్ల నీరు చెరువుల బాటపట్టింది. వి.కోట పట్టణానికి పడమర వైపున పత్రపల్లె దాటాక ముదిమడుగు చెరువు వద్ద గ్రావిటీ ద్వారా నీరు దాసార్లపల్లె వద్దకు చేరుకోవాల్సి ఉంది. అయితే శనివారం ముదిమడుగు చెరువ వద్ద వాల్వ్ మూత తీసేయడంతో నీరు పైకి ఉబికివచ్చియి. ఆపై దానిని గుర్తించిన హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు కష్టపడి వాల్వ్‌ను మూసేశారు. ఆదివారం ఉదయం తిరిగీ ముదిమడుగు చెరువు వద్ద కాల్వ నుంచి తూమును పైకి లేపడంతో నీరు చెరువుకు చేరింది. అలాగే దాసార్లపల్లె వద్ద తూమును పైకి లేపడంతో అక్కడ నీరు చెరువుకు బిరబిరా పరుగులు తీసింది. ఈ దృశ్యాలను స్థానికులు వీడియోలు తీసి షోషల్ మీడియాలో హల్‌చల్ చేశారు. వాటిని గమనించిన హంద్రీ-నీవా అధికారులు తూముల వద్దకు చేరుకుని వాటిని పూర్తిగా మూసేశారు. ఈ నెల 29న సీఎం కుప్పం పర్యటన ఉన్న నేపథ్యంలో అక్కడ చెరువులకు నీరు నింపాక లిస్టులో ఉన్న ప్రతి చెరువుకు నీరు విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. కాలువ నుంచి రెండు చెరువులు 25 శాతం నీరు చేరాయి.

హిందూ, ముస్లింలు సోదరభావంతో మెలగాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సుబ్బరాయుడు

పుంగనూరు రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27న వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా హిందూ, ముస్లింలు సోదరభావంతో ఉం డాలని పుంగనూరు సీఐ సుబ్బరాయుడు సూచించారు. ఆదివారం స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో ముస్లిం మతపెద్దలు, హిందూ మతపెద్దలు, యువతతో నిర్వహించిన శాంతిసమావేశంలో ఆయన మాట్లాడుతూ పండుగ సమయంలో ఎలాంటి ఘర్షణలకు పాల్పడరాదని, యువత చిన్న చిన్న తప్పులు జరిగితే సర్దుబాటు చేయాల్సిన బాధ్యత కమిటీ సభ్యులు తీసుకోవాలని సూచించారు. వినాయక విగ్రహాల ఏర్పాటు, నిమజ్జనం ఊరేగింపు సమయంలో పోలీసు నిఘా ఉంటుందని, ఎవరూ చూడలేదని పోకిరితనం చూపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్‌ఐలు వెంకటరమణ, చందనప్రియ, మత పెద్దలు భక్తవత్సలరాజు, త్రిమూర్తిరెడ్డి, జగదీష్‌రాజు, బాలసుబ్రహ్మణ్యం, అంజుమాన్ కమిటీ కార్యదర్శి ఇబ్రహీం పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత వి.కోట జట్టు



గెలుపొందిన జట్లతో వాలీబాల్ మాజీ క్రీడాకారులు

బంగారుపాళ్యం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామోత్సవ క్రీడల్లో భాగంగా ఆదివారం బంగారుపాళ్యం ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన వాలీబాల్ పోటీల్లో జిల్లా నలుమూల నుంచి 26 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీలను స్థానిక సీఐ కత్తి శ్రీనివాసులు, ఏఎస్సై మల్లప్ప, మాజీ డీఎస్‌డీవో సుదర్శన్ నాయుడు ప్రారంభించారు. వి.కోట, గంగవరం జట్ల మధ్య ఫ్లడ్ లైట్ల మధ్య జరిగిన ఫైనల్స్ పోరులో వి.కోట జట్టు గెలిచి మొదటి బహుమతిని కైవసం చేసుకుంది. రెండో బహుమతిని గంగవరం జట్టు పొందగా, మూడవ బహుమతిని కార్వేటినగరం, నాల్గవ బహుమతిని బంగారుపాళ్యం జట్టు కైవసం చేసుకున్నాయి. గెలుపొందిన జట్లకు ట్రోఫీతోపాటు మొదటి బహుమతిగా రూ.10వేలు, ద్వితీయ రూ.7వేలు, తృతీయ రూ.5వేలు, నాల్గవ బహుమతిగా రూ.3వేలు జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ ఎంబీ కుమార్‌రాజా, జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు తులసీరెడ్డి, మాజీ క్రీడాకారులు కృష్ణమూర్తి, కామరాజు, తిరుమల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. మొదటి, రెండవ స్థానంలో గెలిచిన జట్లు వచ్చే నెల 7న గుంటూరులోని కేఎల్ వర్శిటీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ఉచితంగా వినాయక విగ్రహాలు



పంపిణీకి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు

పుంగనూరు రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27న నిర్వహించే వినాయక చవితి పర్వదినానికి మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా ఇవ్వనున్నట్లు వారాహి కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు సుబ్బయ్య దీక్షితులు, రాము దీక్షితులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ మంగళవారం స్థానిక కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ అవరణలో పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. విగ్రహాలను 11 పుట్టల నుంచి మట్టి సేకరించి గజమాయం, గోమాయం, పసుపు, చందనం, వట్టివేర్లు, పచ్చకర్పూరం సహా 21 రకాల శుభద్రవ్యాలను కలిపి భక్తిశ్రద్ధలతో ప్రతిమలను తయారు చేస్తున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని పుంగనూరు భక్తులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

గుండెపోటుతో ఆరడిగుంట వీఆర్వో మృతి



వెంకటరమణాచారి (ఫైల్ ఫొటో)

పుంగనూరు రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం ఆరడిగుంట గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్వో) వెంకటరమణాచారి శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. ఆదివారం పుంగనూరు తహసీల్దార్ రాము, ఆర్‌ఐ పణికుమార్, వీఆర్వోలు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు

వి.కోట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం రామాపురంలో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా ముగిశాయి. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో వారం రోజుల ముందు గ్రామంలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి నిత్యం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం స్వామి వారిని ప్రత్యేక పల్లకీపై కొలువు తీర్చి గ్రామవీధుల్లో ఊరేగించారు. జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు దంపతులు పాల్గొన్నారు.

వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ సాయినాథ్

చిత్తూరు అర్బన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27 నుంచి చిత్తూరు నగరంలో జరుపుకోనున్న వినాయక చవితి పండగను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని డీఎస్పీ సాయినాథ్ తెలిపారు. ఆదివారం నగరంలోని శాంతరఘురామన్ కల్యాణ మండపంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, నగరంలోని వినాయక మండపాల నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వినాయక చవితి పండుగను అందరూ కలిసి మెలసి జరుపుకోవాలని చెప్పారు. మండపాల వద్ద ఫైర్ సేఫ్టీని తీసుకోవాలన్నారు. యువత మద్యం తాగి ఘర్షణలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు పలు సమస్యలను పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య వినాయక మండపాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయకూడని పనుల గురించి వివరించారు.

అ'పూర్వ' కలయిక



ఆర్ఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కలసిన పూర్వ విద్యార్థులు

వెదురుకుప్పం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ఆర్ఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆదివారం అపూర్వ కలయికకు వేదికైంది. ఈ పాఠశాలలో 2000-2001 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు 25 ఏళ్ల తర్వాత కలిశారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకుని, యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆనాటి గురువులను సన్మానించారు. పాఠశాలకు అవసరమైన ఎస్‌సీసీ బ్యాండ్‌ను బహూకరించారు.

బాల సాహిత్య నవల ఆవిష్కరణ



జాను అనే నేను నా స్నేహితురాళ్లు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

వెదురుకుప్పం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం యువ రచయిత పేట యుగంధర్ రాసిన బాల సాహిత్య నవల 'జాను అనే నేను నా స్నేహితురాళ్లు' పుస్తక ఆవిష్కరణ ఆదివారం సాయంత్రం తిరుపతిలో జరిగిందని రచయిత తెలిపారు. తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి పుస్తక ఆవిష్కరణ చేశారని తెలిపారు. ఓరియంటల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు, కేంద్ర సాహిత్య అకాడమీ విజేత గంగిశెట్టి శివకుమార్, రచయితలు జొన్న విత్తుల శ్రీరామచంద్రమూర్తి, ఆకుల మల్లేశ్వరరావు, కివి మేఘనాథరెడ్డి, పల్లిపట్టు నాగరాజు, డాక్టర్ లక్ష్మీప్రియ పాల్గొన్నారని తెలిపారు.

విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలి



సమావేశంలో మాట్లాడుతున్న విజయం వైస్ ప్రిన్సిపాల్ దేవేంద్ర

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): నేటి సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థుల్లోనూ పోటీతత్వం పెరగాలని విజయం విద్యా సంస్థల అధినేత తేజోమూర్తి అన్నారు. ఏపీ ఇన్ఫర్మేషన్ అకాడమీ, నాంది ఫౌండేషన్-మహేంద్ర ప్రైడ్ క్లాస్ రూం సంయుక్తంగా స్థానిక విజయం సైన్స్ అండ్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన శిక్షణా తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో విజయం సాధించడానికి మౌఖిక నైపుణ్యం, భావ వ్యక్తీకరణ, సాఫ్ట్ స్కిల్స్ ప్రదర్శన, ఉద్యోగ నిర్వహణ నైపుణ్యం ఎంతో అవసరమన్నారు. వైస్ ప్రిన్సిపాల్ దేవేంద్ర మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఎదుర్కొనే సవాళ్లను ఎలా అధిగమించాలనే దానిపై సూచనలు చేశారు. ఏపీ ఇన్ఫర్మేషన్ అకాడమీ, నాంది ఫౌండేషన్-మహేంద్ర ప్రైడ్ క్లాస్ రూం బృందం సభ్యులు శరత్, మహబూబ్ సుహాని, తాన్వీ, విజయ రాఘవ, క్రిబాకరన్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం



శ్రీరంగరాజపురం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండలం క్షీరసముద్రంలో వెలసిన వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి వైభవంగా రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. కల్యాణోత్సవానికి ఉభయదారులుగా ఎన్.అమరావతి, సుబ్బానాయుడు కుటుంబసభ్యులు వ్యవహరించారు. ఆలయ కమిటీ సభ్యులు, టీడీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గంధమనేని జయశంకర్ నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, పురుషోత్తం నాయుడు, ఆర్.రాజేంద్ర నాయుడు, వి.రమేష్ నాయుడు, కె.రమేష్ నాయుడు, బి.కేశవులు నాయుడు, కె.త్యాగరాజులు నాయుడు, వి.బాలాజీ పాల్గొన్నారు.

కత్తిరెడ్డిపల్లిలో....



పెనుమూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కత్తిరెడ్డిపల్లిలో ఆదివారం రాధారుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా మల్లికార్జునరెడ్డి దంపతులు వ్యవహరించారు. స్వామివారికి వేదపండితులు అభిషేకాలు నిర్వహించి, వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణోత్సవాన్ని జరిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారి విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు.

నేడు యూరియా పంపిణీ

యాదమరి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండలంలో ఉన్న రైతు సేవాకేంద్రాల్లో సోమవారం యూరియా పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి దీప ఒక ప్రకటనలో తెలిపారు. యూరియా కావాల్సిన రైతులు తప్పనిసరిగా ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ బుక్ తీసుకొని రావాలని ఆమె సూచించారు.

దివ్యాంగుడిపై దాడి

● ఒకరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

గంగాధరనెల్లూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నవేపంజేరి గ్రామంలో దివ్యాంగుడైన హరిప్రసాద్‌పై ఓ వ్యక్తి దాడిచేసిన ఘటన ఆదివారం జరిగింది. వేపంజేరి గ్రామానికి చెందిన హరిప్రసాద్ ఆదివారం చిన్నవేపంజేరి గ్రామానికి వెళ్లాడు. అతడికి అదే గ్రామంలోని ఆనందరెడ్డికి అప్పుకు సంబంధించి వివాదం ఉంది. ఈ క్రమంలో వారిద్దరికి మాట మాట పెరగడంతో హరిప్రసాద్‌పై ఆనందరెడ్డి దాడికి పాల్పడ్డాడు. దీంతో దివ్యాంగుడైన తనపై దాడికి పాల్పడినట్లుగా ఆదివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో హరిప్రసాద్ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దాడికి పాల్పడ్డ ఆనందరెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ఇదిలా ఉంటే హరి ప్రసాద్ వ్యవహారశైలి సరిగ్గా ఉండదని వేపంజేరి, చిన్నవేపంజేరి పంచాయతీల ప్రజలు ఆరోపిస్తున్నారు. కులవృత్తి కోసం అతడిని తన గ్రామాల్లోకి రావద్దని గతంలోనే చెప్పామన్నారు. అతడిపై తాము కూడా సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

అమ్మవారి ఆలయంలో చోరీ

పూతలపట్టు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడుగు చింత గ్రామ సమీపాన గల ముత్యాలమ్మ ఆలయంలో చోరీ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయానికి అమర్చిన ఇనుప గేట్ల కమ్మీలను వెల్డింగ్ మిషన్లతో కట్‌చేసి అమ్మవారి తాళిబొట్టుతో పాటు గుడిలో వున్న నగదును చోరీచేసి తీసుకెళ్ళారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు సీఐ కృష్ణమోహన్ తమ సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరసిద్ధుడి సేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తులు

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సీఎం జోషి, హెచ్‌పీ సందేష్ ఆదివారం కాణిపాక వరసిద్ధుడిని విడివిడిగా దర్శించుకున్నారు. వారిని ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వారికి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, కాణిపాకం ఎస్ఐ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కానగలమ్మ ఊరేగింపు



వెదురుకుప్పం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం బోడి బాపన గుంట సమీపంలోఉన్న కానగలమ్మను ప్రత్యేక అలంకరణలో ఆదివారం రాత్రి ఊరేగించారు. అంతకు ముందుగా తిరునాళ్లను పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేకపూజలు, అభిషేకాలు చేశారు. మహిళలు ఆదివారం మధ్యాహ్నం అమ్మవారికి పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు. భక్తులకు అన్నదానం జరిగింది. ఊరేగింపు సందర్భంగా ఇంటింటా కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. పగలు, రాత్రి హరికథా కాలక్షేపం జరిగింది.

రాజ్యాంగ సవరణ బిల్లు ప్రజాస్వామ్యంపై గొడ్డలి వేటు



జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు

చిత్తూరు రూరల్, ఆగస్టు 24 (ఆంధ్ర జ్యోతి): కేంద్రం ప్రవేశపెట్టిన 130వ రాజ్యాంగ సవరణ బిల్లు ప్రజాస్వామ్యంపై గొడ్డలి వేటు అని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బంగార్రావు అన్నారు. ఆదివారం నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో యూనియన్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ ఇప్పటికే తనకు వ్యతిరేకంగా ఉన్న పార్టీలను దారికి తెచ్చుకునేందుకు సీబీఐ, ఈడీ, ఐటీ శాఖలను అనైతికంగా ప్రయోగిస్తోందని సుప్రీంకోర్టు పలుమార్లు వ్యాఖ్యానించిందన్నారు. ఈ బిల్లు అటువంటి దాడులను చట్టబద్ధం చేసి, ప్రతిపక్ష పార్టీల నాయకులను వేధించి లోబరుచుకునేందుకు మాత్రమే ఉపయోగపడుతుందని విమర్శించారు. అనంతరం సుమారు 50 మంది కార్యకర్తలు తమ పార్టీలో చేరినట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సురేంద్రనాథ్ తెలిపారు. అనంతరం పార్టీ జెండాను నాయకులు ఆవిష్కరించారు. నాయకులు ఓబయ్య, చంద్రశేఖర్, విశ్వనాథ్, చెన్నయ్య, అనిల్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల గోడు పట్టదా...?

గుడిపాల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): హైవే అధికారుల నిర్లక్ష్యం వలన నంగమంగళం, గురుగునత్తం, అనూరాధకాలనీ, మండికృష్ణాపురం గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ ఎంపీపీ నాగరాజుయాదవ్, మండల టీడీపీ కార్యదర్శి చంద్రమోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం వారు మాట్లాడుతూ సంవత్సరాల కొద్దీ జాతీయ రహదారి పనులను నత్తనడకన చేస్తూ గ్రామస్తులను నరకయాతనకు గురిచేస్తున్నారన్నారు. నంగమంగళం రైల్వే గేటు వద్ద వర్షం కురిసినప్పుడల్లా రాకపోకలకు సంబంధించి గ్రామస్తులు పడుతున్న బాధలు వర్ణనాతీతం అన్నారు. ఎన్నిసార్లు రైల్వే అధికారులకు, కాంట్రాక్టర్‌కు తెలియజేసినా పట్టించుకోవడం లేదని చెప్పారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఎం.బండపల్లిలో కార్డన్‌సెర్చ్



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ కృష్ణమోహన్

పూతలపట్టు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండలం ఎం.బండపల్లి గ్రామంలోని కొంతమందిపై ఫిర్యాదులు రావడంతో స్థానిక సీఐ కృష్ణమోహన్ ఆదివారం ఉదయం తమ సిబ్బందితో వెళ్లి కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. బండపల్లిలో కొంతమంది గంజాయి విక్రయించడం, చోరీకి గురైన వాహనాలను కుదువ పెట్టుకోవడం వంటి కార్యకలాపాలు చేస్తున్నారని పోలీసులకు ఫిర్యాదులందాయి. దీంతో సీఐ ఆదివారం తమ సిబ్బందితో గ్రామంలోకి వెళ్ళి కొన్ని ఇళ్లను తనిఖీ చేయడంతో పాటు వాహనాలపై దృష్టిసారించారు. గ్రామస్తులకు గంజాయి అమ్మకాలు, ద్విచక్ర వాహనాలపై అవగాహన కల్పించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వినాయక చవితికి ఏర్పాట్లు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆలయాల్లో ఈ నెల 27న జరుగనున్న వినాయక చవితి పండుగకు గాను ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. స్థానిక డీఎ రోడ్‌లో శివశక్తి వినాయక సంఘం ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఏర్పాట్లు ప్రారంభించారు. ఈ మేరకు చలువ పందిళ్లు ఏర్పాటుచేసి భారీ విగ్రహాలను నిలపనున్నారు. ఇదిలా ఉండగా దేవదాయ శాఖ ఆధ్వర్యంలో మిట్టూరు సుందర వినాయక, బజారువీధి శివ షణ్ముగ సుందర వినాయక, దుర్గానగర్ కాలనీ సర్వసిద్ధి వినాయక ఆలయాల్లో చవితి ఉత్సవాల ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. పలు వీధుల్లో వినాయక చవితి ఉత్సవ మంటపాల అనుమతులకై పోలీస్, రెవెన్యూ, నగరపాలక కార్యాలయాలకు ఉత్సవ నిర్వాహకులు పోటెత్తారు.

భారీ వినాయక విగ్రహాల తరలింపు

● విద్యుత్ కోతలతో ప్రజలకు అవస్థలు

యాదమరి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలంలో భారీ వినాయక విగ్రహాల తయారీ కేంద్రాల నుంచి జరుగుతున్న రవాణా కారణంగా మండల కేంద్రంలో తరచుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. వినాయక చవితి సమీపిస్తుండడంతో విగ్రహాలను జిల్లా నుంచే కాకుండా, సరిహద్దు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటకలకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో 30 అడుగుల వరకు ఉండే భారీ విగ్రహాలను తీసుకెళ్లే సమయంలో విద్యుత్ తీగలు తగులుతున్నాయి. దీనివల్ల షార్ట్ సర్క్యూట్ అయి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడమే కాకుండా, ప్రమాదాలు కూడా సంభవించే అవకాశాలున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ భారీ విగ్రహాలను సురక్షితంగా తరలించేందుకు విద్యుత్‌శాఖ సిబ్బంది గంటల తరబడి సరఫరాను నిలిపివేస్తున్నారు. దీంతో వ్యాపారులు, గృహిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాల దుకాణాలు, ఐస్ క్రీమ్ పార్లర్ల నిర్వాహకులు ఎక్కువగా నష్టపోతున్నారు. స్థానిక పాల వ్యాపారి విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ గత వారం రోజులుగా రోజుకు 10 నుంచి 20సార్లు విద్యుత్ విద్యుత్ సరఫరా నిలిచిపోతోందని, దీనివల్ల తమ పాల ఉత్పత్తులు పాడైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 'రోజులో ఒక నిర్దిష్ట సమయం కేటాయించి విగ్రహాలను తరలిస్తే బాగుంటుంది. ఈ సమస్యపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు' అని ఆయన తెలిపారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు.

● పోలీసులకు ఫిర్యాదు చేశాం

- కొండయ్య, ఏడీ, ఏపీఎస్పీడీసీఎల్

భారీ విగ్రహాల తరలింపు వల్లే విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. ఈ విషయమై మా సిబ్బంది ఇప్పటికే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.



విద్యుత్ లైన్ల సమాంతర ఎత్తులో ప్రమాదకరంగా తరలిస్తున్న వినాయక విగ్రహాలు

దెబ్బతిందా... రాళ్లు తొలగించారా...?

● మొరవ నుంచి నీటి వృథా

● కొద్దిరోజులకే చెరువు ఖాళీ అవుతుందని గ్రామస్తుల ఆందోళన



చెరువు మొరవకట్టకు ఉన్న రాళ్లను తొలగించడంతో వెలుపలికి వెళుతున్న నీరు



పీహెచ్‌సీ వద్ద రైతు చంద్రబాబు వేరుశనగ పైరులో నిలిచిన నీరు

గంగాధరనెల్లూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూగుండ్రం చెరువుకట్ట దెబ్బతిందా... లేక గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లు తొలగించారా అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పరిసర ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి తూగుండ్రం చెరువు నిండిపోయింది. దీంతో చెరువుకు ఓ పక్క ఫకీర్‌తోట వద్ద, మరో పక్క పాత పాళ్యం దళితవాడ వైపు గల మొరవలు పారుతున్నాయి. ఫకీర్‌తోట వైపు గల మొరవకట్టలోని రాళ్లు చెరువునీటి ఉధృతికి కొట్టుకుపోయాయో లేక గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారో కాని నీరు వృథాగా పోతోంది. దీంతో కొద్దిరోజులకే నీరు మొత్తం పోయి చెరువు ఖాళీ అయిపోతుందేమోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. మొరవ నుంచి వచ్చే నీరు ఫకీర్‌తోట వైపు నుంచి సత్యమ్మ గుడి పక్కన, దళితవాడలో ఇళ్ల వద్దకు చేరుకుని కిందకు వెళ్లే అవకాశం లేక రోడ్డుపైకి వచ్చాయి. ఈ పరిస్థితి గమనించి గ్రామానికి చెందిన షణ్ముగం మొదలి కాల్వను బాగుచేయడానికి పూనుకోగా, పార్లమెంట్ టీఎన్‌టీయూసీ అధికార ప్రతినిధి జీవరత్నం వెంటనే తూగుండ్రం సర్పంచ్ శ్రీబాబు, పంచాయతీ కార్యదర్శి శిరీషకు సమాచారం అందజేశారు. దీంతో వారు ఎక్స్‌కవేటర్‌తో తూగుండ్రం దళితవాడ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద కాల్వను బాగుచేయించడంతో నీరు మొత్తం రైతు చంద్రబాబు పొలంలోని వేరుశనగ పంటపై సాగుతోంది. సంబంధిత అధికారులు స్పందించి నీరు వృథాగా పోకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. అదేవిధంగా ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు నీవా నదిలో కూడా నీరు స్వల్పంగా ప్రవహిస్తోంది.

వాలీబాల్ విజేత వి.కోట జట్టు



గెలుపొందిన జట్లతో వాలీబాల్ మాజీ క్రీడాకారులు

బంగారుపాళ్యం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామోత్సవ క్రీడల్లో భాగంగా ఆదివారం బంగారుపాళ్యం ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన వాలీబాల్ పోటీల్లో జిల్లా నలుమూల నుంచి 26 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీలను స్థానిక సీఐ కత్తి శ్రీనివాసులు, ఏఎస్సై మల్లప్ప, మాజీ డీఏ ఎడీవో సుదర్శన్ నాయుడు ప్రారంభించారు. వి.కోట, గంగవరం జట్ల మధ్య ఫ్లడ్ లైట్ల మధ్య జరిగిన ఫైనల్స్ పోరులో వి.కోట జట్టు గెలిచి మొదటి బహుమతిని కైవసం చేసుకుంది. రెండో బహుమతిని గంగవరం జట్టు పొందగా, మూడవ బహుమతిని కార్వేటినగరం, నాల్గవ బహుమతిని బంగారుపాళ్యం జట్టు కైవసం చేసుకున్నాయి. గెలుపొందిన జట్లకు ట్రోఫీతోపాటు మొదటి బహుమతిగా రూ.10వేలు, ద్వితీయ రూ.7వేలు, తృతీయ రూ.5వేలు, నాల్గవ బహుమతిగా రూ.3వేలు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఎంబీ కుమార్‌రాజా, జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు తులసీరెడ్డి, మాజీ క్రీడాకారులు కృష్ణమూర్తి, కామరాజు, తిరుమల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. మొదటి, రెండవ స్థానంలో గెలిచిన జట్లు వచ్చే నెల 7వ తేదీన గుంటూరులోని కేఎల్ యూనివర్శిటీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఈషా ఫౌండేషన్ కో ఆర్డినేటర్ వినోద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈషా ఫౌండేషన్ వాలంటీర్లు పాల్గొన్నారు.

భావితరాలకు తెలియజేయడానికే మహా భారత యజ్ఞాలు



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్ తదితరులు

తవణంపల్లె, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): భావితరాలకు మన సంస్కృతీ సంప్రదాయాల గురించి తెలియజేయడానికి మహాభారత యజ్ఞాలు, హరికథలు దోహదపడతాయని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. మండలంలోని గాజులపల్లెలో జరుగుతున్న మహాభారత యజ్ఞంలో ఆదివారం ఎమ్మెల్యే పాల్గొని తిలకించారు. అనంతరం స్థానిక టీడీపీ నాయకులు ప్రవీణ్ కుమార్, ఎమ్మెల్యే మురళీమోహన్ ఆధ్వర్యంలో మహాభారతాన్ని తిలకించడానికి వచ్చిన 2 వేల మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటేష్‌చౌదరి, బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ నాయుడు, అరగొండ సింగల్ విండో చైర్మన్ రంజిత్‌రెడ్డి, నాయకులు గోపి, మురళి, వేణు, లోకనాథ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంకల్ప దీక్షతోనే తెలుగు ప్రాభవం సాధ్యం



సదస్సులో పాల్గొన్న సాహితీవేత్తలు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): సమాజంలోని అన్నీ వర్గాల వారు తెలుగు ప్రాభవం పట్ల దృఢ సంకల్పంతో కృషి చేస్తే తప్పనిసరిగా తెలుగు ప్రాభవం సాధ్యమవుతుందని భారతీయ తెలుగు రచయితల సమాఖ్య అధ్యక్షులు మద్రిపూడి దేవేంద్రరావు అన్నారు. ఆదివారం సంఘ కార్యాలయంలో తెలుగు ప్రాభవం అనే అంశంపై పలువురు సాహితీవేత్తలు తమ అభిప్రాయాలను ప్రస్తావించారు. సాహితీవేత్త నారాయణ స్వామి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మాతృభాష పట్ల శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం సదస్సులో పాల్గొన్న సాహితీవేత్తలను దేవేంద్రరావు ఘనంగా సత్కరించారు. ఓం కేశవరెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఓం శ్రీధర్‌రెడ్డి, కోటేశ్వర మొదిలియార్ తదితరులు పాల్గొన్నారు.

కూలడానికి సిద్ధంగా ఉన్న చెట్టును తొలగించండి



ఐరాల(కాణిపాకం), ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కాణిపాక క్షేత్రానికి అతి సమీపంలో తిరువణంపల్లె వద్ద రోడ్డుపై ఎండిపోయిన ఓ భారీ చెట్టు కూలడానికి సిద్ధంగా ఉంది. ప్రస్తుతం కాణిపాకంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నందున ఈ మార్గంలో వాహనాల రద్దీ పెరుగుతుంది. భారీ వర్షం కురిస్తే చెట్టు కూలడం ఖాయమని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆర్&బీ అధికారులు ఈ చెట్టును పరిశీలించి, తొలగించాలని పలువురు యాత్రికులు కోరుతున్నారు.

టైప్ రైటింగ్ జూనియర్ విభాగంలో సంజయ్‌కు స్టేట్ ఫస్ట్ ర్యాంకు



చిత్తూరు కల్చరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని మిట్టూరు ఈశ్వరి టైప్ రైటింగ్ అండ్ కంప్యూటర్ గ్రూప్ ఇన్‌స్టిట్యూట్‌లో టైప్ రైటింగ్ జూనియర్ గ్రేడ్‌లో శిక్షణ పొందిన ఎస్ఎల్ సంజయ్ ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన పరీక్షల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంకును కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా సంజయ్‌ను, ప్రిన్సిపాల్ ఈశ్వరిని పలువురు అభినందించారు. కాగా గిరింపేట శ్రీరాఘవేంద్ర టైప్ ఇన్‌స్టిట్యూట్‌లో జూనియర్, సీనియర్ గ్రేడ్‌లలో సెంట్ పర్సంట్ ఉత్తీర్ణత సాధించారు.

వర్షానికి కూలిన ఇంటి గోడలు



కూలిన ఇంటిని చూపెడుతున్న నాగయ్య

యాదమరి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షాలకు ఓ ఇంటి గోడలు తడిసి కూలిపోయాయని రెవెన్యూ అధికారులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఓటివారిపల్లె పంచాయతీ మంగళపల్లి దళితవాడకు చెందిన నాగయ్య, క్రిష్ణమ్మ దంపతులు నివాసముంటున్న ఇంటి మట్టిగోడలు, పైకప్పు వర్షాల ధాటికి కూలిపోయాయి. ఈ సమయంలో వారు తమ కూతురు ఇంట్లో ఉండడంతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. వస్తువులు దెబ్బతిన్నాయని, తమను ఆదుకోవాలని వీఆర్వో సురేష్ బాబుకు బాధితులు వినతిపత్రం అందజేశారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాములగుడి వీధి జైన్ ప్రార్థనా మందిరంలో ఆదివారం చిత్తూరు జైన్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తిరుపతి అరవింద నేత్ర వైద్యశాల డాక్టర్ల సహకారంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో 120 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్లద్దాలు అందజేశారు. వారిలో 76 మందికి కంటి ఆపరేషన్లు అవసరం కాగా, చిత్తూరు జైన్ సంఘం ఆధ్వర్యంలో అన్నీ ఖర్చులు భరించి వైద్యం చేయించ నున్నట్లు జైన్ సంఘం అధ్యక్షులు సుభాష్ జైన్ తెలిపారు. ప్రేమ్, సాగర్, ప్రవీణ్, లలిత్, కమలేష్, ఎవంత్, జ్యోతి, విశాల్, ఆనంద్, జతిన్, అమిత్‌జైన్లు, రాజేష్ చౌదరి పాల్గొన్నారు.

నేనేరమ్మ ఆలయానికి విరాళం



దేరా కండ్రిగలో ధర్మకర్తకు విరాళమిస్తున్న దాతలు

వెదురుకుప్పం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కార్వేటి నగరం మండలం దేరా కండ్రిగలోని నేనేరమ్మ ఆలయానికి ఇదే మండలంలోని చింతతోపుకు చెందిన ప్రమీల, నాగరాణి ఆదివారం రూ.10వేలు విరాళం ఇచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ధర్మకర్త బి.ఆనందుడు, దొమ్మరాయ ప్రకాష్, కె.రాజారెడ్డి, ఆర్.మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం

వెదురుకుప్పం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. అరక్షేణం దాతలు శారద, సుకుమార్ కుటుంబీకుల వితరణతో భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు.

నేడు నగరపాలక కార్యాలయంలో 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): నగరపాలక కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ నరసింహ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధిత అధికారులు హాజరవ్వాలని కోరారు.